ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- గుంటూరు జిల్లాకు చెందిన స్కేటింగ్ క్రీడాకారిణి ఎం. జెస్సి రాజ్ ఈరోజు రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాన్ని అందుకుంది.
- రాష్ట్ర ప్రజలపై పెంచిన విద్యుత్ ఛార్జీలను నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు.
- పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో గత కొద్ది రోజులుగా కొనసాగుతున్న అల్పపీడనం ఈరోజు బలహీనపడిందని వాతావరణం కేంద్రం తెలిపింది.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 117వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

===================

ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఈరోజు న్యూ ఢిల్లీలో చిన్నారులకు అందించారు. రాష్ట్రపతి భవన్ లో జరిగిన కార్యక్రమంలో మొత్తం 17మంది చిన్నారులు ఈ పురస్కారాలను అందుకున్నారు. అందులో భాగంగా గుంటూరు జిల్లాకు చెందిన క్రీడాకారిణి ఎం. జెస్సిరాజ్ పురస్కారాన్ని అందుకున్నారు. చిన్నప్పటి నుంచే స్కేటింగ్ క్రీడపై మక్కువ చూపిన జెస్సిరాజ్ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇప్పటివరకు అనేక పోటీల్లో పాల్గొని 50 పతకాలను సాధించింది. కళలు, సంస్కృతి, శౌర్యం, ఆవిష్కరణలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, సామాజిక సేవా, క్రీడలు, పర్యావరణం వంటి రంగాల్లో విశేష ప్రతిభ చూపిన చిన్నారులకు, వారి విజయాలకు గుర్తింపుగా ఈ పురస్కారాలను అందిస్తున్నారు.

===================

రాష్ట్ర ప్రజలపై పెంచిన విద్యుత్ ఛార్జీలను నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఈరోజు వైఎస్సార్ జిల్లా పులివెందులలోని భాకరాపురం పార్టీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొని ప్రజలు, కార్యకర్తలు నుంచి ఆయన వినతులు స్వీకరించారు. అన్ని వర్గాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలపై ప్రజల పక్షాన పార్టీ పోరాటం చేస్తుందని రేపు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చిందని అన్నారు. ఇదిలా ఉండగా విద్యుత్ ఛార్జీలను పెంచేందుకు అనుకూలంగా గత ప్రభుత్వం ఈఆర్సీకి సిఫార్సు చేసిందని, ఒకప్పుడు మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు అధిక ధరలతో కొనుగోళ్లు చెయ్యాల్సిన పరిస్థితికి గత ప్రభుత్వమే కారణమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.

===================

పార్వతీపురం మన్యం జిల్లాలో ఇప్పటివరకూ 567 రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈరోజు పార్వతీపురం మండలం పుట్టూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు రీసర్వేలో భూముల సబ్ డివిజన్ అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, అక్కడే ఏర్పాటు చేసిన ల్యాండ్ మ్యాపుల ఆధారంగా రైతుల భూవివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సదస్సుల ద్వారా ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని, ఏ ఒక్కరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న రెవెన్యూ సదస్సుల్లో గ్రామస్తులు, రైతుల భూములకు సంబంధించి ఎటువంటి సర్వే సమస్యలు లేకుండా సాధ్యమైనంత వరకు వారి సమక్షంలోనే పరిష్కరించాలని కలెక్టర్ తహశీల్ధార్లకు, సిబ్బందికి సూచించారు.

===================

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద సోలార్ విద్యుత్ కనెక్షన్లు అందించడానికి షెడ్యూల్డ్ కులాలు తెగలకు స్త్రీనిధి నుంచి రుణాలను మంజూరు చేయాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. ఈరోజు జిల్లా పర్యటన నిమిత్తం వచ్చిన స్త్రీనిధి కార్యక్రమ అధికారి జీవివిడి హరిప్రసాద్, కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రుణాల మంజూరుపై ఇరువురు చర్చించారు. జిల్లాలోని స్వయంశక్తి సంఘాల్లో సుమారు 55 వేలమంది

ఎస్‌సి, ఎస్‌టి మహిళలు ఉన్నారని, నూరు శాతం లక్ష్యంగా వీరందరికీ సూర్యఘర్ పథకం కోసం రుణాలు మంజూరు చేయాలని ఆయనను కలెక్టర్ కోరారు.

===================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

===================

పార్వతీపురం మన్యం జిల్లా యువజన ఉత్సవ్ 2024ను ఈనెల 31వ తేదీన నిర్వహించనున్నామని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె. వెంకట ఉజ్వల్ తెలిపారు. ఈ మేరకు ఈరోజు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ప్రతీ సంవత్సరం జనవరి 12న జాతీయ యువజనోత్సవాలు జరుపుకుంటున్నామని, అయితే ఈసారి జిల్లా యువజన ఉత్సవ్ కార్యక్రమం ఈనెల 31న ఉదయం 10 గంటలకు పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. జిల్లా యువజన ఉత్సవ్ లో భాగంగా 15 నుండి 29 సంవత్సరాల వయసు గల యువతి, యువకులకు జానపద నృత్యాలు, రకరకాల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.

===================

విరామం

===================

మూడు చక్రాల మోటరైజ్డ్ వాహనం కలిగి ఉన్న దివ్యాంగుల పెట్రోల్ రాయితీ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె. కవిత తెలిపారు. ఈ మేరకు ఈరోజు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత కలిగిన శారీరక దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ కార్యాలయానికి నిర్ణీత సమయంలో దరఖాస్తు ఫారంతో పాటు, సదరం సర్టిఫికేట్, పెట్రోల్ కొనుగోలు చేసిన రసీదులు, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వాహనం రిజిస్ట్రేషన్ ధృవీకరణ పత్రము తదితర వివరాలతో సమర్పించాలని కోరారు. వివరాలకు 08942-240519 ఫోన్ నంబర్ కు కార్యాలయ పని వేళలలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

===================

తీరప్రాంతాల ప్రజల జీవితాల్లో తీవ్ర విషాదం మిగిల్చిన 2004 సునామీ వచ్చి నేటికి 20 సంవత్సరాలు పూర్తయ్యింది. 2004 డిశంబర్ 26వ తేదిన వచ్చిన సునామి లాంటిది మళ్లీ రాకూడదని వేడుకుంటూ విశాఖలోని పెదజాలరి పేట మత్స్యకారులు గంగమ్మకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశాఖ తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు హాజరై గంగమ్మ ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. కాగా 2004 డిసెంబర్ 26వ తేదీ ఉదయం 9 గంటల 5 నిమిషాల సమయంలో ఆకస్మాత్తుగా భారీ అలలు తీరాన్ని తాకాయి. సగటున 4 మీటర్ల ఎత్తున ఎగసిపడిన రాకాసి అలల విధ్వంసానికి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 301 గ్రామాలు ప్రభావితమయ్యాయి. ఈ సునామీ కారణంగా 105 మంది ప్రాణాలు కోల్పోయారు. కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో దీని ప్రభావం ఎక్కువగా నమోదైంది.

===================

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో దక్షిణ కోస్తాంధ్ర, ఉత్తర తమిళనాడు తీరాల వద్ద నిన్నటినుండి కొనసాగుతున్న అల్పపీడనం ఈరోజు బలహీనపడిందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. మరికొన్ని గంటల్లో అదే ప్రాంతంలో ఈ అల్పపీడనం బలహీనపడే సూచనలు ఉన్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని అనుబంధ ఉపరితల ఆవర్తనం అదే ప్రాంతములో ఇప్పుడు సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ వరకు విస్తరించి ఉందని ఈ ప్రభావంతో రాష్ట్రంలో రేపు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్ర అధికారి వెల్లడిస్తూ...

(వాయిస్ బైట్..27 సెకన్లు)

===================

అదే విధంగా రాబోయే నాలుగు రోజులు కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావారణ శాఖ పేర్కొంది. రాష్ట్రంలోని అన్ని పోర్టుల్లో మూడో నంబరు ప్రమాద హెచ్చరికలు కొనసాగుతున్నాయని మత్స్యకారులు ఎవరూ ఆదివారం వరకూ సముద్రంలోకి వేటకు వెళ్లరాదని, రైతులు వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

===================

ఖరీఫ్ సీజన్లో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అనంతపురం జిల్లాలో ప్రకటించిన కరువు మండలాలలో జనవరి 2, 3 తేదీలలో కేంద్ర బృందం పర్యటించనుందని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ శివ నారాయణ్ శర్మ తెలిపారు. ఈ పర్యటన

నేపథ్యంలో ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ఈరోజు ఆయన కలెక్టర్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.

===================
===================